# 18

# నాకు కావాలి ఓ పెద్ద ప్రపంచం

**కూ**రగాయలు కొనుక్కుని ఇంటికి తిరిగి వెళ్తున్న శివరావు మాస్టారికి సంచీ బరువుగా ఏం లేదు. డబ్బులు చాలానే ఖర్చయ్యాయి గానీ సంచీలో కూరగాయలాట్టే లేవుమరి. జీవితమే బరువుగా తోచింది.

అమ్ముకునే వాళ్ళూ లబలబ లాడుతూ కొనుక్కునే వాళ్ళూ విలవిలలాడుతూ గోల పెడుతున్న రోజులివి. ఎవరు సుఖపడుతున్నట్టూ? ఎందుకిలా మారిపోయింది కాలం? మార్చిన వాళ్ళెవరు?

తన ప్రశ్నలకి తనకే నవ్వొచ్చింది. ఆ మార్చిన వాళ్ళల్లో తాను మాత్రం లేడా? తన పిల్లలు లేరా?

హాయిగా ఉన్న ఊళ్ళో... సొంత ఊళ్ళో సొంత ఇంట్లో ఉండక... పట్నం పట్నం అంటూ ఈ పట్నానికి... అద్దె కొంపలోకి వొచ్చిపడ్డాడుగా. ఎందుకూ? పిల్లల పోరు పడలేక. ఉన్న ఇద్దరు కొడుకులూ స్వదేశంలో ఉద్యోగాలు చేసుకోకుండా కోరికల గుర్రాలెక్కి అమెరికా అమెరికా అంటూ పరుగులు తీశారు. అప్పుడప్పుడు వాళ్ళు స్వదేశం వొచ్చినప్పుడు పల్లెటూరు రావడానికిష్టపడక... అక్కడికి రావడానికి మాకు సమయం సరిపోదు పైగా మా పిల్లలకి ఇబ్బంది అవుతుంది ఉన్న పదిరోజులూ. అందుకని పట్నంలో ఇల్లు అద్దెకి తీసుకుని ఇక్కడే ఉండమని ఆజ్ఞలు జారీ చేశారు. తప్పలేదు మరి పిల్లలకోసం. తనలాంటి తల్లిదండ్రులింకెంత మందో ఈ పట్నాల్లో.

అటు సేద్యం చేసుకునే వాళ్ళూ ట్రాక్టర్లు వొచ్చాక... పట్నాల్లో కూలీపన్లకి పడుతూ లేస్తూ ఎండమావుల వెంట పడినట్టే నలిగిపోతున్నారు అడకత్తెర బతుకుల్లో.

ట్రాక్టర్లూ... కాంట్రాక్టర్లూ... పెద్ద పెద్ద కంపెనీలవాళ్ళూ... బడుగు జీవి బతుకుల జీవన విధానాలతో ఆటలాడుతూ విదేశాలకి తమ వ్యాపార సంబంధాలు విస్తరించుకుంటున్న వ్యాపారస్తులూ ఇదేగా నేటి ప్రపంచం సగటు మనిషి స్వతంత్రంగా పని చేసుకుంటూ నిలబడగలిగే స్థలం... కనుమరుగయ్యే పరిస్థితులు సృష్టిస్తున్న వ్యక్తుల కన్నుల్లో చెమరింపు కనపడదే? కోట్లు లెక్కించుకుంటూ నిద్రలేక కన్నులెండిపోతున్నాయేమో వారికి!...

ఏవిటో?... తన పిచ్చిగానీ... ఈ ప్రపంచీకరణలో... కుటుంబాలకి కుటుంబాలే జీవకళ కోల్పోయి వెల వెల పోవట్లేదూ? ఉమ్మడి కుటుంబాల సంగతి దేవుడెరుగు... భార్యాభర్తలు కలిసి ఒకే ఊళ్ళో ఉండడమే గొప్ప విషయం ఈ ప్రపంచీకరణ రోజుల్లో.

"ఏదో పరధ్యానంలో నడుస్తున్నట్టున్నారే మాస్టారు..." అన్న పలుకరింపుతో పక్కకి తిరిగి చూశాడు. తమ ఇంటి వెనక వీధిలో ఉండే రామక్రిష్ణయ్య. ఆయనా తనలాంటి బాధితుడే.

"పిల్లల గురించిన ఆలోచన్లా?" పక్కనే నడుస్తూ మెల్లిగా అడిగాడు.

నీరసంగా నవ్వాడు శివరావు.

"అసలు మన పిల్లలు అమెరికా పోతామన్నప్పుడే వొద్దని చెప్పి ఉండాల్సింది కదా? తెలివి తక్కువ పని చేశాం. పోవద్దని వాళ్ళని ఒప్పించలేని మనచేతకానితనం ఇప్పుడు మనబతుకుల్నే కాదు... అక్కడ వాళ్ళ బతుకుల్ని మనశ్శాంతి, స్తిమితం లేకుండా కుంగదీసి శాసిస్తోంది. ఏవంటారు? ఔనా కాదా?"

"మీరన్నమాట ఒకవిధంగా నిజమే కానీ... పూర్తిగా ఏకీభవించలేను. ఎందుకంటారా? ఒప్పుకోకపోతే వాళ్ళ భవిష్యత్తు చేజేతులా మనమే పాడుచేస్తున్నామేమో అన్న బాధ ఒకవైపు... డబ్బు బాగా సంపాదించి ఉద్ధరిస్తారన్న ఆశ మరోవైపు మనచేత సరేననిపిస్తాయి కదా! దిగితేకానీ లోతు తెలియదు మరి. పర్యవసానం... జీవితానికి విలువలేకుండా పోయింది... బతుకు పోరాటం మాత్రం నిరాశా నిట్టూర్పులతో భయం భయంగా... మనశ్శాంతికి దూరమై సాగిస్తున్నాం".

"ఔను... బాగా చెప్పారు. ఏ రోజు కా రోజు ఉద్యోగం ఎక్కడ ఊడుతుందో అన్న భయంతో వాళ్ళు... ధనం ఒక్కటేనా కావల్సింది... పిల్లలు దగ్గరున్నారన్న

నిశ్చింత... ధైర్యం అక్కర్లేదా అన్న దిగులుతో మనలాంటి వాళ్ళు రోజులు గడుపు కొస్తున్నాం. కాలమే సమాధానం చెప్పాలి" భవిష్యత్తు మీద భారం వేసి చిన్నగా నిట్టూర్చాడు రామక్రిష్ణ.

"ఇంకేం చెప్తుందండీ కాలం? ప్రపంచీకరణలో సమిధగా మారమని అంటోంది" శివరావు స్వరంలోని మార్పు గమనించి ఆయనవైపు చూడబోయిన రామక్రిష్ణ ఎందుకో ఆ పని చెయ్యలేదు. తలపంకించి ఊరుకున్నాడు.

"వెళ్ళొస్తానండీ" అంటూ శివరావు తన సందు మలుపు తిరిగాడు.

ఎండలో నడిచి రావడంవల్ల ఇంట్లో అడుగు పెడుతూనే ఫ్యాన్ వేసుకోవాలని పించింది. కరెంటు బిల్లు కళ్ళ ముందు కదిలి వెయ్యకుండానే కుర్చీలో కూలబడ్డాడు. రాత్రిళ్ళు ఎలాగో ఫ్యాన్ వెయ్యక పోతే గాలి ఉండదు... దోమలూ పీకేస్తాయి. పగలు కూడా ఎందుకు బిల్లు పెంచుకోవటం?

అసలే ఫోన్ చేసినప్పుడల్లా సన్నాయి నొక్కులు నొక్కుతూనే ఉంటారు పిల్లలు... వాళ్ళవి అక్కడ తుమ్మితే ఊడే ముక్కు ఉద్యోగాలనీ... చాలా జాగ్రత్తగా డబ్బు ఖర్చు పెట్టమనీ హెచ్చరిస్తూనే ఉంటారు. ఒక వయసొచ్చాక కడుపున పుట్టిన పిల్లలైనా పుసుక్కున మాటేదైనా అన్నారంటే తలకొట్టేసినట్టే అనిపిస్తుంది కదా! ఓ రోజు పెద్దకొడుకు ఫోన్లో అరిచాడు కరిచినట్టే. "మీరు అనారోగ్యాలు తెచ్చుకుంటే రమ్మన్నప్పుడు రావడానికి మాకు కుదరదు. రాలేము. ఇక్కడ ఈ దేశంలో సంగతి తెలుసా? ఆరోగ్యం లేకపోతే అమెరికాలో బతుకే లేదు. రోజూ వాకింగ్‌కి వెళ్ళండి".

చెప్పడానికీ బాగానే ఉంది... వినడానికీ బాగానే ఉంది నాయినా... ఈ ట్రాఫిక్‌ని తప్పించుకుంటూ వెళ్ళి కూరలూ సరుకులూ తెచ్చుకునేటప్పటికే అమ్మయ్య ఈ రోజుకి ఏ యాక్సిడెంటూ అవకుండా ప్రాణం దక్కిందని అనుకోవలసి వస్తోంది. ఇంక వాకింగ్ కూడానా? ఈ వాహనాలూ ఆ వాహనాలూ తప్పించుకుంటూ ఎక్కడో ఉన్న పార్కుకో మైదానానికో వెళ్ళేటప్పటికి తాత ముత్తాతలు దిగిరావల్సిందే. వాహనాల రద్దీ మొదలవకముందే తెల్లవారుఝామున వెళ్తే దొంగలభయం. పక్కింటావిడ గొలుసు తెంపుకుపోయారు... డబ్బూ నగలూ ఏవీ దొరక్కపోతే తోసిపడేసి పారిపోతారు. అదృష్టం బావుంటే దెబ్బలతో గాయాలతో బయటపడి ప్రాణం దక్కుతుంది. తెల్లవారుఝామున దొంగలు తెల్లారాక వాహనాలు...

ఈ రెండింటి మధ్యా బతుకు తెల్లారిపోవల్సిందే... గ్లాసుతో మంచినీళ్ళు భర్తకి అందించి కూరగాయల సంచీ చేతిలోకి తీసుకుని చూసింది సత్యవతి. అప్రయత్నంగా నిట్టూర్చింది. ధరలు మండి పోతున్న విషయం ఆవిడకీ తెలుసుగా... అందుకే ఆ నిట్టూర్పు. సొంత ఊరు పల్లెటూరైనా... పల్లెటూరు కాబట్టేలే చూసుకు చూసుకు తినాలి పట్నంలో... ఆ గడిచిన కాలమే మెరుగు... మళ్ళీ ఆ రోజులొస్తే ఎంత బావుండును. విద్య నేర్పే గురువుకి పిల్లలెంత మర్యాదామన్నానా ఇచ్చేవారు... ఆ పిల్లల్ని భావి భారత పౌరులుగా సంస్కారవంతులుగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నట్టుగా శ్రమించేవారు ప్రాణం పెట్టేవారు ఆ గురువులు కూడా. కాలమహిమ అనుకోవాలో ఏమోగానీ... పట్నాల్లో ఈ రోజుల్లో విభిన్నంగానే కనిపిస్తోంది కదా విద్యా వ్యవస్థ. సంస్కారాన్ని తుడిచిపెట్టేసి... మానవత్వాన్ని మట్టుపెట్టేసి... ఒక్క విద్యకే ప్రాధాన్యం అన్నట్టుగా ప్రవర్తిస్తున్నారే ఈ పిల్లలు గురువులు కూడా. సంస్కారం లేకపోయాక చదువులు మాత్రమే ఉండి లాభం ఏమిటి?...

ఉండబట్టలేక ఆ మాటే భర్తని అడిగింది.

నవ్వాడు శివరావు "అమాయకురాల్లా ఉన్నావు. సంస్కారం మానవత్వం ఆ పదాలే మరుగున పడిపోయే రోజులొచ్చినప్పుడు వాటి అర్థం తెల్సిన వాళ్ళ సంఖ్య తగ్గిపోదూ? ఇప్పుడంతా కంప్యూటర్... ఇంటర్నెట్... వెబ్‌సైట్ ప్రపంచీకరణ... ఈ పదాలకే చోటుంది. తల్లిదండ్రులూ పిల్లలూ వీరిద్దరి గురి విదేశాలపైనే ఉంది. నువ్వనుకునే మాటల అర్థాలు పిల్లలకి తెలియజెప్పే ఆసక్తి తల్లిదండ్రులకి లేదు... తెలుసుకునేంత తీరుబడి, సమయం పిల్లలకి లేదు".

"మన పిల్లల్ని విదేశం వెళ్ళమని మనం అనలేదు... వెళ్తారని అనుకోనూ లేదు".

"నిజమే... మనకి దాన్నిగురించిన అవగాహన లేదు... అందుకే వెళ్ళద్దనీ అనలేదు... వెళ్ళమని మనంతట మనం కోరలేదు. స్నేహితుల ద్వారా ఒకరినించి ఒకరు వివరాలు సేకరించుకుని మేము వెళ్తామంటూ వాళ్ళ ప్రయత్నాలు వాళ్ళు చేసుకుని నిర్ణయం మనకి చెప్పేశారు. మనం నిమిత్త మాత్రులమయ్యాం. చిన్నగా తల ఊపి మౌనంగా ఉండిపోయింది సత్యవతి.

✧ ✧ ✧

సింగన్నకి గుండె రగిలిపోతోంది తన బతుకు తల్చుకుని.

ఆ పేటలో ఇళ్ళు పడుతున్నాయని తెలియగానే అక్కడ కొట్టుపెట్టుకున్నాడు. చిన్న వస్తువు మొదలు బియ్యం వరకూ అన్ని నిత్యావసర వస్తువులూ అమ్మేవాడు. పేటలో వాళ్ళంతా ఏం కొనుక్కోవాలన్నా అతనికొట్టుకే వొచ్చేవారు. అందరితోనూ మంచిగా ఉండేవాడు. లాభాలెక్కువ తీసుకుని మోసాలు చేసేవాడు కాదు. అందరికీ ఆత్మీయుడయ్యాడు. ఒక దుకాణదారుడిలా కాకుండా ప్రతి ఒక్కరికీ అన్నయ్యో తమ్ముడో అనిపించుకునేలా మసులుకునేవాడు. తిండికి లోటు లేకుండా ఇల్లు గడిచిపోయేది. పిల్లలిద్దర్నీ బడికి పంపేవాడు. చూస్తుండగానే... ఓ పెద్ద కంపెనీ వాళ్ళ హైటెక్ సూపర్ మార్కెట్ వెలిసింది ఎదురుగా. బేరాలు పోయాయి. తన పొట్ట కొట్టడానికే వెలిసిందని కుంగిపోయాడు. వాళ్ళు చేసుకునే పెట్రోలు వ్యాపారం... సెల్ ఫోన్ల వ్యాపారం చాలకనా తనలాంటివాళ్ళ పొట్టలు కొట్టడం? మనిషన్నాక కాస్తో కూస్తో న్యాయం ఉండాలి కదా? అవి కొ ంటే ఇవి ఉచితం, ఇవి కొంటే అవి ఉచితం అంటూ ఆకర్షణలు గుప్పించేస్తూ ఉచితం అని చెప్పేవాటి ధర కూడా అసలు సరుకులో తెలివిగా పొందుపరుస్తూ విస్తరించుకు పోయిన వ్యాపారంతో తనలాంటి వాళ్ళ బతుకులు కుంచించుకు పోవూ? కొట్టు మూతపడింది. ఇల్లు గడిచేదెలా? చేసిన అప్పులు తీరేదెలా? ఇంక పిల్లల చదువు మాటే లేదు కదా? బడిమానిపించేశాడు ఇద్దరినీ. భార్యనీ, కూతుర్నీ ఇళ్ళల్లో పాచిపన్లకి పొమ్మన్నాడు. ఒక వడ్రంగి దగ్గిర... సుత్తులూ మేకులూ రంపాలూ అందిస్తూ టీలూ నీళ్ళూ తెచ్చిపెట్టే చేతికింద పని కుర్రాడిలా కొడుకుని పెట్టేశాడు. వాడికి చదువుమీద కాస్తో కూస్తో ఆసక్తి ఉంది. ఏదో నాలుగక్షరమ్ముక్కలు అబ్బుతున్నాయి. అలాంటి వాడికి ఇలాంటి పరిస్థితి వొచ్చేసరికి తట్టుకోలేకపోయిందా లేత మనసు. దాంతో తండ్రిమీద కోపం పెంచుకున్నాడు. చదువెలాగో పోయింది. డబ్బు బాగా సంపాయించేద్దామన్న కోరిక అడ్డదారులు తొక్కేలా చేసింది. చెడు అలవాట్లకి బానిసనీ చేసింది ఆ చిన్న వయసులోనే. కొడుకుని బడిమానిపించి తానెంత పెద్ద తప్పు చేశాడో అర్థమైంది సింగన్నకి.

ఆ రోజు నాగయ్య దగ్గిరకి పరిగెత్తాడు.

"నాగయ్య మావా... నేను చెప్పిన సంగతేం చేశావు? నీకు తెల్సిన ఆ దుబాయ్ ఏజెంటుతో నాగురించి చెప్పావా? అక్కడికి పోయి బాగా డబ్బు సంపాయిస్తాను".

"ఇంక నువ్వా ఆలోచన మానుకోడం మంచిది సింగన్నా".

"అలా అనకు మావా... బతుకుతెరువు పోగొట్టుకుని నష్టాల్లో అప్పుల్లో ఉన్నవాడిని. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాయించుకోవాలని ఆశపడటంలో తప్పుందా?"

"తప్పే సింగన్నా... ఇక్కడ చిన్న దెబ్బకే తట్టుకోలేక అల్లాడుతున్న వాడివి... అక్కడ దేశంకాని దేశంలో పెద్ద పెద్ద దెబ్బలు తట్టుకోగలవా?"

"ఏవిటి మావా నువ్వనేది?" అర్థం కాలేదు సింగన్నకి.

"ఔనురా... ఆ మధ్య అక్కడికెళ్ళినవాళ్ళు గగ్గోలు పెడుతున్నారిప్పుడు. మమ్మల్ని మా దేశం పంపించెయ్యమంటూ మొత్తుకుంటున్నారు. నానా కష్టాలూ పడుతున్నారట".

"అలా జరుగుతుందంటే నమ్మలేకపోతున్నాను".

"ఎందుకు జరగవూ? ఏవైనా జరుగుతుంటాయి డబ్బు రంథిలో ముందూ వెనకా చూసుకోకుండా పడిపోయేవాళ్ళకి. ఎలాంటి కష్టం వొచ్చినా నీ దేశంలో నువ్వుంటే కనీసం నీ ఊపిరి నువ్వు తీసుకోవచ్చు. లేకపోతే అది కూడా బిగపట్టుకుని ఆసరాకోసం ఆధారం కోసం అల్లాడిపోతావు. అందుకే కదా అన్నారు దూరపు కొండలు నున్నగా ఉంటాయని".

"ఆ పేటలో వాళ్ళంతా నా కొట్లో కొంటున్న రోజుల్లో వాళ్ళకీ నాకూ మధ్య వ్యాపార బంధం కాదు మావా... ఒకరకమైన ఆత్మీయత ఉండేది. ఇప్పుడో? సంపాదన ఒక్కటే కాదు అపేక్షకీ మంచి మాటకీ కూడా దూరమయ్యాను. సింగన్న కళ్ళు చెమ్మగిల్లాయి. జాలిగా చూశాడు నాగయ్య.

"మాకూ కష్టం వొచ్చిపడింది సింగన్నా. ఓ పెద్ద కంపెనీ వాళ్ళు విదేశంతో చేతులు కలిపి పరిశ్రమేదో పెడుతున్నారుట. మా ఇళ్ళన్నీ కూలగొట్టి ఆ స్థలంలో కడతారుట".

"ఎంత అన్యాయం మావా! వాళ్ళ వ్యాపారాలు పెంచుకుంటూ కోట్లకి కోట్లు దోగేసుకుంటూ మనలాంటి వాళ్ళకి నిలవనీడకూడా లేకుండా చేద్దామనా?"

"ఇదంతా ప్రెపంచీకరణ మాయట... మొన్న ఒకాయన చెప్పాడు. ఇదివరకు పండుగలకి అయ్యవార్లని ఇంటికి పిలిచి పూజలు జరిపించుకునేవారెంతో మంది.

ఇప్పుడు కేసెట్లు పెట్టి ఎవరికి వాళ్ళు పూజ చేసేసుకుంటున్నారు... ఆ వృత్తిలో పాతుకుపోయిన వాళ్ళు ఆదాయం తగ్గిపోయి దిక్కులు చూడాల్సిందేగా? ఈ ప్రెపంచీకరణ కాదుగానీ అన్నిటిమీదా పడుతోంది దెబ్బ. అయ్యవార్లు దొరకని చోట కేసెట్లు కావాలి. నిజమే. కానీ అలాగని అందరూ కూడా పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం అన్నట్టు ఉంటే ఎలా? నీకింకో విషయం తెల్సా?" ఒక్క క్షణం ఆగాడు నాగయ్య.

ఏం చెప్పబోతున్నాడా అని కుతూహలంగా చూశాడు సింగన్న.

"మా బావమరిది కారుడ్రైవర్‌గా ఒకళ్ళింట్లో పనిచేస్తున్నాడు కదా... వాళ్ళ పిల్లాడికి పాపం అంతుపట్టని జబ్బేదో చేస్తే అమెరికానించి వొచ్చిన ఓ డాక్టరు ఆపరేషన్ చేసి పోయే ప్రాణాన్ని నిలబెట్టాడు. అప్పటినించి మనదేశానికి డాక్టర్లు రావడం వైద్యం చెయ్యడం ఇది కూడా ప్రెపంచీకరణే అంటాడు మా బావమరిది".

"అయితే ఇదేదో తిరకాసుగానే ఉంది మావా... నా మట్టి బుర్రకి అంతుపట్టదు".

"ఏవుందీ... ఒక్కటే మనం కోరుకుంటాం... బతుకులు బాగు చెయ్యాలిగానీ బతుకులు కూలదొయ్యడం... పొట్టలు కొట్టడం న్యాయం కాదని పోరాడతాం. ఔనా కాదా?"

సింగన్న జవాబిచ్చేలోపలే పరిగెడుతూ అక్కడికొచ్చి చేరింది అతని కూతురు.

"నాన్నా... నాన్నా... మరేమో... నేనూ అమ్మా పనికి పోతాం చూడు సుందరయ్యగారింటికి... వాళ్ళమ్మాయి... మరేమో... వాళ్ళమ్మాయి..." చెప్తున్న ఆ పిల్ల గొంతు కొంచెం వణికింది.

"ఏవైందే? వాళ్ళమ్మాయికేమైంది?" కంగారు పడ్డాడు సింగన్న.

"వాళ్ళమ్మాయి ఆత్మహత్య చేసుకుంది నాన్నా.."

"అయ్యో... ఎంత పని జరిగింది... ఎందుకలా చేసిందో? పద నాగయ్య మావా అసలేవయ్యిందో ఏవిటో చూసొద్దాం..." అంటూ గబగబా ఆ ఇంటి దారి పట్టాడు సింగన్న.

వాళ్ళు వెళ్ళేటప్పటికి పదిమందీ పోగయి ఉన్నారక్కడ.

ఆ ఇంటికి ఎదురిల్లే అవడంతో శివరావు మాస్టారు సత్యవతి కూడా ఆ గుంపులో ఉన్నారు. మొత్తానికి సాయంత్రానికి అసలు కారణం... ఆత్మహత్యకి మూలకారణం తెలిసింది ఆ దంపతులకి.

"ఈ ఇంటర్నెట్టూ... వెబ్‌సైట్లూ... వీడియో కెమెరాలూ ఇవన్నీ అభివృద్ధి అనుకోవాలా? అధోగతి అనుకోవాలా?" తనని తనే ప్రశ్నించుకుంటున్న భర్తవైపు విచిత్రంగా చూసింది సత్యవతి.

"ఏవిటండీ మీలో మీరే మాట్లాడుకుంటున్నారు?"

తలెత్తి అయోమయావస్థలో ఉన్నట్టుగా చూశాడాయన.

"ఎదురింటి వాళ్ళమ్మాయి గురించే ఆలోచిస్తున్నాను. ఆడపిల్లల మానప్రాణాలతో ఆటలాడుకోవటం ఎంత పెద్ద తప్పు! అలాంటిది... ఆ తప్పుని సుందర దృశ్యాల్లా ప్రపంచమంతా అందరూ చూడాలని వెబ్‌సైట్లో పెట్టడం... ఎంత దిగజారిపోయాడు మనిషి... నాగరికత అంటే నైతిక విలువల్ని కోల్పోవడమను కుంటున్నాడా? ఆడపిల్లల జీవితాలతో చెలగాట మాడటానికి... బ్లాగుల్లో ఒకరినొకరు పరోక్షంగా తిట్టుకోడానికి... ఛాటింగ్ పేరుతో అపరిచితులు సమస్యల్లో ఇరుక్కోడానికి... ఇందుకేనా విజ్ఞానం పనికొస్తున్నది?"... ఇంటర్నెట్‌తో ప్రపంచమే మన ఇంట్లో ఉందని మురిసిపోవాలా? మానసిక ఆరోగ్యం కోల్పోతున్నామని విచారపడాలా? అర్థంకావట్లేదు సత్యవతీ... ప్రపంచాన్ని చిన్నది చేసే తాపత్రయంలో మనిషి మనసు కూడా చిన్నదై పోతోందేమో కుంచించుకుపోయి?..." గుండె పట్టినట్టయి... గొంతు బొంగురు పోయింది శివరావుకి. తన చిన్ననాటిలా విశాలమైన ప్రపంచం కావాలని పించిందాయనకి. మరి అభివృద్ధి సాధించేది ఎలా? ఎదురు ప్రశ్నించింది మనసు.